సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 29 । జనవరి । 2024



## అందరి సహకారంతో అభివృద్ధి

అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి ఫలాలు సిద్ధిస్తాయని కలెక్టర్ మల్లికార్జున అన్నారు. 8లో



## ఆట..పాట

కోలాటం సాంప్రదాయక సామూహిక ఆట. కోల–ఆట అనే రెండు పదాల కలయికతో కోలాటం అనే పదం ఉద్భవించింది. 8లో

## బీచ్‌లో మిస్ పర్ఫెక్ట్



సినీనటి లావణ్య త్రిపాఠి ఆదివారం ఉదయం బీచ్ రోడ్డులో సందడి చేశారు. 8లో

# జోష్

- సంగివలస సభ విజయంతో వైఎస్సార్ సీపీ క్యాడర్‌లో సమరోత్సాహం
- ప్రతీ ఇంటికి వెళ్లి జరిగిన మంచిని వివరిస్తామంటున్న శ్రేణులు



సాక్షి, విశాఖపట్నం/తగరపువలస : 'ఈ దుష్టచతుష్టయం పద్మవ్యూహంలో చిక్కుకుపోవడానికి ఇక్కడ ఉన్నది అభిమన్యుడు కాదు.. అర్జునుడు.. పెత్తందారులపై ఈ కురుక్షేత్ర యుద్ధానికి నేను సిద్ధం.. మీరంతా సిద్ధమా..?' అంటూ భీమిలి నియోజకవర్గంలోని సంగివలస వేదికగా.. అశేష జనవాహిని మధ్య ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం ఉప్పొంగింది. రాబోయే ఎన్నికలకు ఉత్తరాంధ్రలోని 34 నియోజకవర్గాల ముఖ్య నాయకులు, గృహ సారథులు, ప్రజా ప్రతినిధులను సీఎం జగన్ 'సిద్ధం'చేస్తూ.. చేసిన ప్రసంగంతో ఆత్మ విశ్వాసం రెట్టింపైంది. ఉత్తరాంధ్ర నుంచి ముఖ్యమంత్రి పూరించిన ఎన్నికల శంఖారావం ప్రతిపక్ష నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించగా.. క్యాడర్‌కు పూనకాలు వచ్చేశాయి. ఈ 56 నెలలో కాలంలో కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు ఏ గ్రామాన్ని చూసినా మనం చేసిన మంచి కనబడుతోందని.. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్న ఏకైక లక్ష్యంతో పనిచేస్తున్నట్లు సీఎం జగన్ స్పష్టం చేశారు. సచివాలయం, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ విధానం, నాడు–నేడుతో మారిన పాఠశాలలతో రాష్ట్రమంతటా వైఎస్సార్ సీపీ మార్క్, జగన్ మార్క్ కనిపిస్తోందన్నారు. రూ.2.58లక్షల కోట్ల సంక్షేమ పథకాలను అవినీతికి తావులేకుండా.. కులమతాలు, పార్టీలకు అతీతంగా నేరుగా లబ్ధిదారులకు అందించిన తీరును కళ్లకు కట్టినట్టు వివరించారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు హయాంలో ఆయన మార్క్ పని ఒక్కటీ లేదని దుయ్యబట్టారు. పొత్తులు, జిత్తుల పద్మవ్యూహాలతో చంద్రబాబు నేతృత్వంలోని కౌరవ సైన్యాన్ని ఎదుర్కొనేందుకు ప్రజల ఆశీస్సులు, దేవుడి దయతో మీ బిడ్డ జగన్ సిద్ధంగా ఉన్నాడని ప్రకటించడంతో.. మేము సైతం సిద్ధం అంటూ కార్యకర్తలు జై కొట్టారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి.. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టేలా ట్యూన్ చేసి.. తమ కర్తవ్యాన్ని గుర్తు చేశారని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలన్నీ కలిసొచ్చినా 2024లో వైఎస్సార్ సీపీ జెండాను మళ్లీ ఎగరేస్తామంటూ పార్టీ శ్రేణులు స్పష్టం చేశాయి.



సంగివలసలో జరిగిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ క్యాడర్

### సీఎం జగన్‌కు ప్రజలే పెద్ద సైన్యం



సంగివలసలో జరిగిన సిద్ధం సభ సూపర్ సక్సెస్ అయింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కార్యకర్తలకు దిశానిర్దేశం చేసి.. వారిలో నూతన ఉత్తేజం నింపారు. ప్రజా సంకల్పయాత్రలో ప్రజల కష్టాలను దగ్గర నుంచి చూసిన ఆయన.. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వారి కష్టాలను తీర్చడమే లక్ష్యంగా పాలన సాగించారు. దేశమంతా రాష్ట్రం వైపు చూసేలా సంక్షేమాన్ని పరవళ్లు తొక్కించారు. కరోనా కాలంలోనూ సంక్షేమ పథకాలను కొనసాగించిన ఏకైక సీఎం జగన్. సమష్టిగా ముందుకు సాగుతూ.. మళ్లీ ఆయన్ని ముఖ్యమంత్రిగా చేసుకుంటాం. – కోలా గురువులు, వైఎస్సార్ సీపీ, జిల్లా అధ్యక్షుడు

### వచ్చే ఎన్నికల్లో విజయం ఏకపక్షమే..



సిద్ధం సభను విజయవంతం చేసిన వైఎస్సార్ సీపీ కుటుంబసభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు. మా రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి నేతృత్వంలో సమష్టిగా ముందుకెళ్తున్నాం. సంగివలసలో జనసందోహం చూసి ప్రతిపక్ష పార్టీల నేతల్లో వణుకు మొదలైంది. ఎవరెన్ని కుట్రలు పన్నినా.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే తామంతా ఉన్నామని ప్రజలు, వైఎస్సార్ సీపీ కుటుంబం స్పష్టం చేసింది. కార్యకర్తల్లో ఈ జోష్ చూస్తుంటే.. రానున్న ఎన్నికల యుద్ధంలో విజయం ఏకపక్షమే. అది వైఎస్సార్ సీపీ పక్షమే. – ముత్తంశెట్టి శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే

### పేదల ముఖ్యమంత్రి జగన్



పేదల ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశవ్యాప్తంగా పలువురి నేతల మన్ననలు పొందారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఆదర్శంగా తీసుకుని అక్కడ అమలు చేస్తున్నారు. అయినప్పటికీ ఇక్కడి ప్రతిపక్షాలు పాఠాలు నేర్చుకోకుండా ముఖ్యమంత్రి జగన్‌పై దుష్ప్రచారాలు చేస్తున్నారు. వీటిని మనమందరం తిప్పికొట్టాలి. – బొడ్డు అప్పలకొండమ్మ, నాగవంశ కార్పొరేషన్ చైర్‌పర్సన్

### అప్రమత్తంగా ఉందాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మంచి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. అదే సమయంలో నక్కజిత్తుల చంద్రబాబు తన మనుషులతో ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి జగన్‌పై చెడు ప్రచారాలు చేసుకుంటూ పోతున్నారు. ఉత్తరాంధ్ర వేదికగా జరిగిన 'సిద్ధం'సభ విజయవంతం కావడంతో ప్రతిపక్షాల్లో వణుకు మొదలైంది. ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. – పిల్లా సుజాత, నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్

### అన్ని వర్గాలకు అండగా నిలిచారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి సామాజిక న్యాయం అమలు చేశారు. చిన్నారులు, విద్యార్థుల అభివృద్ధికి వేల కోట్ల సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి ఆయన. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద, ఫీజు రీయింబర్స్‌మెంట్, జగనన్న విద్యాకానుక, వైఎస్సార్ పోషకాహార కిట్లు ఇలా ఎన్నో పథకాలు రాష్ట్రంలో అమలవుతున్నాయి. –కంతిమహంతి అనూషా పట్నాయక్, శిష్టకరణాల కార్పొరేషన్ చైర్‌పర్సన్

### మళ్లీ సీఎంగా జగనే..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలు, దేవుడిని నమ్ముకుని ప్రతిపక్షాలతో ఒంటరి పోరాటానికి సిద్ధం అయ్యారు. ప్రజా బలం.. మన బలగమే ఆయనకు కొండంత అండ. మళ్లీ వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకుందాం. అందుకు నేను సిద్ధం. – దుక్క లోకేశ్వరరావు, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్

## న్యూస్‌రీల్

### హక్కులతో పాటు బాధ్యతలూ గుర్తెరగాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్: ప్రజలు తమ ప్రాథమిక హక్కులతో పాటు బాధ్యతలను తెలుసుకోవాలని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ నందిని అన్నారు. ఆర్.కె బీచ్ నుంచి వైఎంసీఏ వరకు ది ప్రో బోనో క్లబ్, డీఎస్ఎన్ఎల్‌యూ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అవర్ రైట్స్–అవర్ ఆబ్లిగేషన్స్ ర్యాలీలో ఆమె మాట్లాడారు. హక్కులు, బాధ్యతలపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ ర్యాలీని నిర్వహించామన్నారు. న్యాయవాద వృత్తిలో అడుగిడే వారు సమాజానికి సేవ చేయడానికి ఆసక్తి చూపాలన్నారు. ప్రో బోనో క్లబ్ చైర్మన్ బి.వి.ఎస్.సునీత మాట్లాడుతూ ఎదుట వ్యక్తి హక్కు మన బాధ్యతగా నిలుస్తుందన్నారు. క్లబ్, లీగల్ సర్వీసెస్ సభ్యులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

### బొత్స ఝూన్సీని కలిసిన మళ్ల



బొత్స ఝూన్సీకి జ్ఞాపిక అందజేస్తున్న విశాఖ పార్లమెంట్ పరిశీలకుడు మళ్ల విజయప్రసాద్

మహారాణిపేట : వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొత్స ఝూన్సీని ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఝూన్సీకి విజయప్రసాద్ జ్ఞాపికను అందజేశారు. ఝూన్సీని కలిసిన వారిలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ, కార్పొరేటర్లు పి.వి.సురేష్, ముర్రు వాణి, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ బాకీ శ్యామ్ కుమార్‌రెడ్డి, ఇతర నాయకులు దొడ్డి కిరణ్, పి.మల్లేశ్వరరావు, గొర్లె అప్పలస్వామినాయుడు, యల్లపు వెంకటేశ్వరరావు, యర్రబిల్లి ప్రభాకరరావు, అనిల్, శ్యామ్, హనుమంతు అప్పలరాజు, మళ్ల యూత్ సభ్యులు తదితరులు ఉన్నారు.

### రేపు విశాఖకు క్రికెటర్ల రాక

విశాఖ స్పోర్ట్స్ : రెండో టెస్ట్ కోసం భారత్–ఇంగ్లండ్ జట్ల ఆటగాళ్లు మంగళవారం విశాఖ చేరుకోనున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 2.10 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి విశాఖ విమానాశ్రయానికి చేరుకోనున్నారని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన స్టేడియంలో ఏర్పాట్లను ఆదివారం పర్యవేక్షించారు. స్టేడియం పరిసర ప్రాంతాల్లో పోలీసుల సమన్వయంతో అవసరమైన భద్రతపరమైన చర్యలకు మ్యాచ్ నిర్వాహక కమిటీ, సిబ్బంది సహకరించాలని ఆదేశించారు. విశాఖలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఈ మ్యాచ్ ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు జరగనున్న విషయం విదితమే. ఇప్పటికే ఈ మ్యాచ్‌కు సంబంధించి ఆన్‌లైన్‌తో పాటు కౌంటర్ల ద్వారా టికెట్ల విక్రయాన్ని చేపట్టామన్నారు. ప్రతీ రోజు రెండు వేల మంది విద్యార్థులకు వారి విద్యా సంస్థ గుర్తింపు కార్డుతో ఉచిత ప్రవేశం కల్పించనున్నామన్నారు.

### నేడు జీవీఎంసీలో జగనన్నకు చెబుదాం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో పారిశుధ్యం, పట్టణ ప్రణాళికా విభాగం, మొక్కల విభాగం, రెవెన్యూ, యూసీడీ, ఇంజనీరింగ్ తదితర విభాగాలకు సంబంధించిన సమస్యలను నగర ప్రజలు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు.

### కరోనా కేసుల నిల్

మహారాణిపేట : విశాఖలో కరోనా తగ్గుముఖం పట్టింది. కొద్ది రోజులుగా ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. సంక్రాంతి సందర్భంగా జనం రాకపోకలు ఎక్కువగా ఉండే నేపథ్యంలో భారీగా కేసులు నమోదవుతాయని వైద్యాధికారులు భావించారు. ఈ మేరకు ఆస్పత్రులలో ఏర్పాట్లు చేశారు. అయితే నాటి నుంచి నేటి వరకు ఒక్క కేసు నమోదుకాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. డిసెంబర్–జనవరి మధ్య మొత్తం 80 మందికి కరోనా సోకింది. వారంతా ప్రస్తుతం పూర్తిగా కోలుకున్నారు.

## ఆలయాల సంరక్షణతోనే పురాతన జ్ఞానం పదిలం

ప్రముఖ కవి జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు

ఏయూ క్యాంపస్: ఆలయ సంరక్షణతోనే మన జ్ఞానం పదిలంగా ఉంటుందని ప్రముఖ కవి జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు అన్నారు. ఆదివారం సాయంత్రం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన వంద గుడుల బండారం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 500 సంవత్సరాలకుపైగా చరిత్ర కలిగిన ఆలయాల్లో 100 దర్శించాలని తాను సంకల్పించి దర్శిస్తున్నానన్నారు. ఆలయాలను దర్శించే సమయంలో అక్కడి పరిస్థితులు దయనీయంగా ఉండటం గమనించామన్నారు. అపార జ్ఞానం దేశ సంపదగా నిలుస్తోందని, ఇది వేదాల కాలం నుంచి వచ్చిందన్నారు. దివ్యభావనల సముదాయమే వేదం అని అన్నారు. దివ్యత్వంతో జీవనం సాగించే విధంగా మన జ్ఞానం మనల్ని నడిపిస్తోందన్నారు. కళలు, సాహిత్యం, భాష విరాజిల్లడానికి వేదమే ప్రధానమన్నారు. మన దేవాలయాలపై దాడులు చేసి సంపదను దోచుకుని, శిల్పసంపదను నాశనం చేశారన్నారు. నేడు కొన్నిచోట్ల గుడిలో పనిచేసే అర్చకుని కంటే ఆలయం బయట ఉండే వారికే అధిక ఆదాయం లభిస్తుండటం ఎలా చూడాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాలయాల ప్రాచీనత, ప్రాధాన్యత తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ఆలయాలు, దేవతలను ఆధారంగా చేసుకుని అనేక మంది కవులు రచనలు చేశారని, తద్వారా సాహిత్య వికాసం సాధ్యపడిందన్నారు. దేవాలయాలు కనుమరుగైతే నూతన సాహిత్యం పుట్టదన్నారు. తద్వారా మన భాష, సాహిత్యం పూర్తిగా నాశనం అవుతాయన్నారు. దీని ఫలితంగా మన సాంస్కృతిక శక్తిని నిర్వీర్యం చేసుకున్నట్లేనన్నారు. ఆలయాలు, నదులు, భాషను సంరక్షించాలని సూచించారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహం ప్రతిష్ట ఎంతో మంచి ఆలోచన అన్నారు. దానిని చూసి నేటి తరం యువతకు రామాయణ గాథను వివరించే అవకాశం కలుగుతుందన్నారు. భావిభారత జాతి బాలరాముని వీర గాథను వింటుందని తాను భావిస్తున్నానన్నారు. మన జ్ఞానం ఎంత ఉన్నతమైనదో బాలరాముడిని చూసి తెలుసుకోవచ్చన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్.వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ భాష, సంస్కృతులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. కార్యక్రమంలో విజయ్ నిర్మాణ్ సంస్థ అధినేత సూరపనేని విజయ్ కుమార్, యోగాచార్య ఘట్టి వేదభాస్కరం, పద్యకవి వామరాజు సత్యమూర్తి, అవధాన సార్వభౌమ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, సంస్కృతాంధ్ర పండితులు పి.టి.జి.వి.రంగాచార్యులు, సాహితీవేత్త నేమాని మంజునాథ్ శర్మ, సూరంపూడి వీరభద్రరావు, జి.వి.ఎస్ మూర్తి పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కవి జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు

## జాయింట్ కలెక్టర్‌గా మయూర్ అశోక్

- జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా కె.ఎస్.విశ్వనాథన్
- అల్లూరి జేసీగా భావన



మయూర్ అశోర్



కేఎస్ విశ్వనాథన్



భావన

సాక్షి, విశాఖపట్నం : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాష్ట్ర వ్యాప్తంగా ఐఏఎస్‌ల బదిలీ ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో భాగంగా ఉమ్మడి విశాఖలోని పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖపట్నం జాయింట్ కలెక్టర్‌గా కె.మయూర్ అశోక్ నియమితులయ్యారు. ప్రస్తుతం విజయనగరం జేసీగా విధులు నిర్వర్తిస్తున్న మయూర్ అశోర్ మహారాష్ట్రలోని పూణేలో 1993లో జన్మించారు. ఐఐటీ ముంబైలో కంప్యూటర్ ఇంజినీరింగ్‌లో బీటెక్, ఎంఏ(పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్) చదివారు. 2018 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారిగా తొలుత బిహార్ కేడర్‌లో చేరారు. అనంతరం ఏపీ కేడర్‌కు వచ్చిన ఆయన 2021 జూన్‌లో విజయనగరం జిల్లా జేసీగా నియమితులయ్యారు. ప్రస్తుతం విశాఖ జేసీగా విధులు నిర్వర్తిస్తున్న కె.ఎస్.విశ్వనాథన్ జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా బదిలీ అయ్యారు. 2017 బ్యాచ్‌కు చెందిన విశ్వనాథన్ తొలుత అనంతపురం ట్రైనీ కలెక్టర్‌గా, కేంద్ర ఫుడ్‌ప్రాసెసింగ్ ఇండస్ట్రీ అసిస్టెంట్ కమిషనర్‌గానూ తర్వాత నర్సాపురం సబ్ కలెక్టర్, ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో పనిచేయడం ఇదే తొలిసారనీ.. ఇది ఛాలెంజ్‌గా స్వీకరిస్తానని విశ్వనాథన్ అన్నారు. అదేవిధంగా అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా భావనను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన భావన ప్రస్తుతం వార్డు, గ్రామ సచివాలయాల అదనపు డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అంతకు ముందు పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా పనిచేశారు.

# గురుకులం పిలుస్తోంది!

- పేద విద్యార్థులకు ఉచిత వసతితో కూడిన విద్య
- సీబీఎస్ఈ బోధనతో గురుకుల చదువులకు క్రేజ్
- పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణతో రాణిస్తున్న విద్యార్థులు
- 2024–25 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ జారీ
- 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశం



విశాఖలోని శ్రీకృష్ణాపురం గురుకులం

విశాఖ విద్య: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో ప్రవేశం పొందేందుకు సమయం ఆసన్నమైంది. 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. గురుకులాల్లో ఉచిత వసతి కల్పించి, కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన అందిస్తున్నారు. గతేడాది నుంచి సీబీఎస్ఈ సిలబస్ బోధన సాగుతుండటంతో గురుకులాల్లో అడ్మిషన్లు పొందేందుకు విద్యార్థులు మరింత ఆసక్తి చూపుతున్నారు. రుచికరమైన పౌష్టికాహారం, విద్యాలయ ప్రాంగణంలో సీసీ కెమెరాల పర్యవేక్షణ, ఇంటర్మీడియట్ స్థాయిలో ఐఐటీ, జేఈఈ వంటి పోటీ పరీక్షలకు సైతం ప్రత్యేక శిక్షణ నిర్వహిస్తుండటంతో.. వీటిలో సీటు దక్కించుకునేందుకు విద్యార్థులు పోటీపడుతున్నారు.

**సీట్ల రిజర్వేషన్ ఇలా..**

ఎస్సీ–75 శాతం, ఎస్సీ–కన్వర్టడ్ క్రిస్టియన్(బీసీ–సీ)–12 శాతం, ఎస్టీ–6 శాతం, బీసీ–5 శాతం, ఓసీ–2 శాతం చొప్పున సీట్లు కేటాయించారు. ఎస్సీ గురుకులాల్లో చదివిన విద్యార్థులతో 60 శాతం సీట్లు, మిగతా 40 సీట్లు ఇతర స్కూళ్లలో చదివిన విద్యార్థులతో భర్తీ చేస్తారు.

**ఇదీ షెడ్యూల్** : ఈ నెల 25న నోటిఫికేషన్ జారీ అయింది. ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఫిబ్రవరి 23 వరకు గడువు ఉంది. మార్చి10న ఉదయం10 నుంచి 12గంటల వరకు 5వ తరగతిలో ప్రవేశాలకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30గంటల వరకు ఇంటర్మీడియట్ ప్రవేశానికి ప్రవేశ పరీక్ష ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన కామన్ ఎంట్రన్స్ టెస్టులో మంచి మార్కులు సాధించిన వారి జాబితాను ప్రకటించి, మెరిట్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు.

- విశాఖపట్నం జిల్లా పరిధిలో శ్రీకృష్ణాపురం(బాలురు), మేహాద్రి గెడ్డ(బాలికలు), మధురవాడ(బాలికలు)లో గురుకుల విద్యాలయాలు ఉన్నాయి. ఒక్కో గురుకులంలో 5వ తరగతిలో 80 సీట్లు, ఇంటర్‌లో బైపీసీ–40, ఎంపీసీ–40 సీట్లు చొప్పున ఉన్నాయి.
- అనకాపల్లిలో బాలురు దేవరాపల్లి, గొలుగొండ, సబ్బవరం, బాలికలు నక్కపల్లి, కోనాం, నర్సీపట్నం, తాళ్లపాలెం, కొక్కిరాపల్లి గురుకులాల్లో అడ్మిషన్లు పొందవచ్చు. ఒక్క సబ్బవరంలో మాత్రం ఎంఈసీ, సీఈసీలో 40 చొప్పున సీట్లు ఉండగా, మిగతా అన్ని కాలేజీల్లోనూ ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో 40 చొప్పున సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఐదో తరగతిలో 80 మంది చొప్పున అవకాశం ఉంది.



ఐఎఫ్‌పీ ప్లాట్ ప్యానల్‌పై పాఠ్యాంశాల బోధన



భోజనాలు చేస్తున్న గురుకుల విద్యార్థులు

### అర్హతలివీ..

5వ తరగతిలో ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే 2011 సెప్టెంబర్ ఒకటి నుంచి 2015 ఆగస్టు 31 మధ్య, ఓసీ, బీసీ, ఎస్సీ(కన్వర్టడ్ క్రిస్టియన్) విద్యార్థులు 2013 సెప్టెంబర్ ఒకటి నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. 3, 4 తరగతులు గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివి ఉండాలి. ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి 2023–24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. 2024 ఆగస్టు 31 నాటికి 17 సంవత్సరాలు వయసు మించకూడదు. ఎస్సీ గురుకులాల్లో చదువుకున్న విద్యార్థులకైతే ఒక ఏడాది సడలింపు ఇస్తారు. విద్యార్థి తల్లిదండ్రుల ఆదాయం ఏడాదికి రూ.లక్ష ఉండాలి.ఐదో తరగతి ప్రవేశానికి http://apgpcet.apcfss.in, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి http://apgpcet.apcfss.in/inter వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

### ప్రతీ విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ



విద్యార్థులకు నాణ్యమైన చదువులు అందించడమే లక్ష్యంగా.. ప్రతి ఒక్కరిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటాం. చదువులతో పాటు, ఇతర అంశాల్లోనూ రాణించేలా తర్ఫీదు ఇస్తాం. మా విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారు. ఉపాధ్యాయులంతా సమన్వయంతో పనిచేస్తున్నాం. –వి.రత్నవల్లి, ప్రిన్సిపాల్, శ్రీకృష్ణాపురం

### సద్వినియోగం చేసుకోవాలి



గురుకులాల్లో అడ్మిషన్లకు గతంలో కన్నా.. ఇప్పుడు పోటీ ఉంది. నాణ్యమైన చదువులు అందుతున్నాయనే నమ్మకం తల్లిదండ్రుల్లో ఏర్పడింది. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిచ్చేలా అన్ని గురుకులాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంది. ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు అర్హులైన, ఆసక్తి ఉన్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. – రూపవతి, బీసీ గురుకుల సొసైటీ కన్వీనర్, ఉమ్మడి విశాఖ జిల్లా

## నేటి నుంచి ఏపీఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణ

సాక్షి, విశాఖపట్నం : ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ) ఆధ్వర్యంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు విశాఖలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి జరగనుంది. వర్చువల్ విధానంలో ఏపీఈఆర్సీ నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణకు అవసరమైన ఏర్పాట్లను ఏపీఈపీడీసీఎల్ ఇప్పటికే పూర్తి చేసి ఆదివారం ట్రయల్ రన్ నిర్వహించింది. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనేందుకు ఏపీఈఆర్సీ అధికారులతో పాటు ఆంధ్రప్రదేశ్ ఇంధనశాఖ, ఏపీట్రాన్స్‌కో, ఏపీజెన్‌కో, సీపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులు ఆదివారం సాయంత్రం నగరానికి చేరుకున్నారు. ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి, సభ్యులు ఠాకూర్ రామసింగ్, పి.వి.ఆర్.రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ సంస్థల ప్రతిపాదనలకు సంబంధించిన సూచనలు, అభ్యంతరాలు, అభిప్రాయాలను వీడియో కాన్ఫరెన్స్(వర్చువల్) ద్వారా స్వీకరిస్తారు. ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని విద్యుత్ పంపిణీ సంస్థల ఛార్జీల ప్రతిపాదనలపై 63 మంది, ఏపీజెన్‌కో ప్రతిపాదనలపై 8 మంది మొత్తంగా 71 మంది అభిప్రాయాలను తెలియచేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం 17 మంది, మంగళవారం 23 మంది, బుధవారం 23 మంది, గురువారం 8 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని అభిప్రాయాలను తెలియచేస్తారు. రోజూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి 2 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు జరగనున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు https://www.apeasternpower.com/apercpublichearing వెబ్‌లింక్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని(లైవ్ స్ట్రీమింగ్) వీక్షించే అవకాశాన్ని కల్పించామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు.

## క్లుప్తంగా

### బొజ్జన్నకొండ వద్ద లైటింగ్, సౌండ్ షో



బొజ్జన్నకొండకు లైటింగ్, సౌండ్ షోను తిలకిస్తున్న ఎంపీ బీవీ.సత్యవతి

**తుమ్మపాల:** బొజ్జన్నకొండ వద్ద లైటింగ్, సౌండ్ షో ఏర్పాటు పనులను బెల్జియం దేశానికి చెందిన ఏజెన్సీ చేపడుతోందని, రెండు వేల ఏళ్ల చరిత్ర కలిగిన బొజ్జన్న కొండకు సంబంధించి అంశాలతో ప్రత్యేక షో ఏర్పాటు పనులు జరుగుతున్నాయని ఎంపీ బి.వి.సత్యవతి తెలిపారు. మండలంలో శంకరం గ్రామంలో బొజ్జన్నకొండ వద్ద ఆదివారం బెల్జియం దేశానికి చెందిన ఓ ఏజెన్సీ ప్రాజెక్టర్ ద్వారా ఏర్పాటుచేసిన లైటింగ్, సౌండ్ షోను ఆమె తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన రూ.7.3 కోట్లతో చేపట్టే పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అనకాపల్లి జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయడంతో పాటు ఆధ్యాత్మిక కేంద్రంగా బొజ్జన్నకొండను తీర్చిదిద్దేందుకు అన్ని విధాల ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జిల్లా ముఖద్వారంగా ఈ ప్రాంతానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధన్యం ఇస్తున్నారని, రాబోయే రోజుల్లో ఇక్కడ జరిగే అభివృద్ధితో పూర్తిగా ఈ ప్రాంతం రూపురేఖలు మారనున్నాయని చెప్పారు. బుద్ధుని జీవిత విశేషాలతో చరిత్రను జోడించి ఇక్కడ లైటింగ్, సౌండ్‌షో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. బుద్ధుని ధ్యానమందిరం, పార్కింగ్, టూరిస్టుల ఫెసిలిటేషన్ కేంద్రం, రెస్టారెంట్ అన్ని రకాల సౌకర్యాలతో ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. బుద్ధుని కొండ, లింగాల కొండ విశిష్టతతో పూర్తిస్థాయిలో షో జరుగుతుందన్నారు. ఇందుకోసం 1.64 ఎకరాల స్థలాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కేటాయించారని చెప్పారు. అభివృద్ధి పనుల అనంతరం స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. విశాఖ పర్యాటనలో బొజ్జన్నకొండ ఓ భాగం కానున్నదన్నారు. బెల్జియం సంస్థ ప్రతినిధులు, డాక్టర్ విష్ణుమూర్తి, తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు పాల్గొన్నారు.

### 30న యలమంచిలిలో మినీ జాబ్‌మేళా

**అనకాపల్లి:** జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యలమంచిలి ఎస్‌జీపీ డిగ్రీ కళాశాలలో ఈనెల 30న మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్, ఐసీఎస్ టీపీలలో ఉద్యోగాల నియామకానికి ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. డిగ్రీ(కెమిస్ట్రీ)చదువుకున్న 27 సంవత్సరాల లోపు యువకులు అర్హులని తెలిపారు. మర్ని వివరాలకు 8309561123, 7036363272 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

# ముచ్చటగొలిపే ఆట వినసొంపైన పాట

అద్భుతమైన జానపద కళా రూపాల్లో ఒకటైన కోలాటం.. ఆట (నృత్యం), పాట(సాహిత్యం), సంగీతం అనే మూడు లలిత కళల సంగమం. ముచ్చటగొలిపే ఆట, వినసొంపైన పాటలు, లయాత్మకమైన కోలల సవ్వడితో చూపరులకు విశేషమైన అనుభూతిని కల్పించడం ఈ ఆట ప్రత్యేకత. అనాది కాలం నుంచి తన అస్థిత్వాన్ని.. కళను కోల్పోకుండా మనుగడ సాగిస్తూ.. అన్ని వర్గాల ప్రజలను ఆకర్షిస్తోంది. అటు ఆడే వారిలోనూ.. ఇటు చూసే వారిలోనూ ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని నింపే కోలాటం పాటల్లో వైవిధ్యమైన సాహిత్యం ఉంటుంది. ఇది సాంస్కృతిక ప్రదర్శనగానే కాకుండా.. ఆరోగ్యకరమైన ప్రక్రియ కూడా.. కోలాటం ఆడటం వల్ల కండరాల బలం, శ్వాసకోశ సామర్థ్యం పెరుగుతుంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో అనే సంస్థలు కోలాటం ఆడుతూ.. దేవుని సేవలో తరిస్తున్నాయి.

– విశాఖపట్నం డెస్క్



తిరుపతిలో శ్రీ జయవీణ సంకీర్తనల కోలాట నృత్య భజన సంఘ సభ్యులు(ఫైల్)



కోలాటం ఆడుతున్న మహిళలు

## అనుభూతుల సవ్వడి కోలాటం

కోలాటం సాంప్రదాయక సామూహిక ఆట. కోల–ఆట అనే రెండు పదాల కలయికతో కోలాటం అనే పదం ఉద్భవించిందని చెబుతారు. కోల అంటే కర్రపుల్ల అని అర్థం. ఆట అంటే క్రీడ, నాట్యం అనే అర్థాలుండడంతో.. కోలాటం అంటే కర్రతో ఆడే ఆట అనవచ్చు. ఇందులో ఇద్దరు లేదా అంత కంటే ఎక్కువ మంది రెండు చేతులతో కర్ర ముక్కలు పట్టుకుని.. పాట పాడుతూ.. లయానుగుణంగా అడుగులు వేస్తూ ఒకరి చేతికర్ర ముక్కలను వేరొకరి చేతికర్రకు తగిలిస్తూ ఆడతారు. ప్రధానంగా ఉత్సవాలు, ఆలయాల్లో ఈ ఆటను ప్రదర్శిస్తుంటారు.

**నృత్య విధానం**

కోలాటం పట్ల ఆసక్తి ఉన్న కొందరు ఒక బృందంగా ఏర్పడి ఈ నృత్యం చేస్తారు. కళాకారులందరూ వర్తులాకారంగా నిలబడి ఇష్ట దేవతా ప్రార్థన చేసిన అనంతరం ఆట ప్రారంభిస్తారు. 20 నుంచి 40 మంది ఆటగాళ్లు కోలాటం జట్టులో ఉంటారు. అందరూ ఒకే రకమైన దుస్తులతో.. కాళ్లకు గజ్జెలతో చూడముచ్చటగా ఉంటారు. కోలాట ప్రక్రియకు జట్టు నాయకుడు, ఆటగాళ్లు, గరిడి, లుద్ది, కోపు, ఎత్తుగడ, ఉసెత్తు, ముక్తాయింపు, కోలాట కర్రలు, గజ్జెలు, అందెలు, వాయిద్యాలు, వెలుగు సాధనాలు తప్పనిసరిగా ఉండాలి. బృంద సభ్యులందరూ గురువు చెప్పే మాటకు కట్టుబడి క్రమశిక్షణతో మెలుగుతారు.

### రాధాకృష్ణులు.. గోపికలే ఆద్యులు

కోలాటానికి రాధాకృష్ణులు, గోపికలే ఆద్యులని కొంత మంది చెబుతారు. నందనందనుడి చుట్టూ గోపికలు చేరి ఆయన్ని ప్రసన్నం చేసుకోవడానికి నర్తించడం ఈ నృత్యానికి తొలి నేపథ్యం కావచ్చంటారు. దేవుడిపై అచంచలమైన భక్తి, ఆధ్యాత్మిక భావనతో సాగే కోలాటం గతంలో కంటే ఇప్పుడు మరింత బాగా పుంజుకుంది. ఆలయాలు, పవిత్ర ప్రదేశాల్లో కోలాట ప్రదర్శనలు తప్పనిసరిగా ఏర్పాటు చేస్తున్నారు.



### కోలాటం అంటే దైవస్మరణ



కోలాటాన్ని దైవస్మరణగా నేను భావిస్తాను. గుండెల నిండా భక్తి భావం నింపుకుని కోలాటం ఆడేటప్పుడు బాధలు, సమస్యలు మరిచిపోతాం. చిడతలు, కంజర్లు, మెడలో దండలు, వడి బియ్యం, పసుపు, కుంకుమ, గాజులు, జాకెట్టుతో కూడిన బుట్ట పట్టుకుని.. అమ్మవారికి వడి బియ్యం సమర్పిస్తూ కోలాటం ఆడుతాం. దీనికి వయసుతో పని లేదు. నేను పదేళ్ల నుంచి అరవై ఏళ్ల వయసున్న మహిళల వరకు కోలాటం నేర్పుతున్నాను. మా గ్రూపులో 25 నుంచి 30 మంది వరకు సభ్యులు ఉన్నారు. అంతా ఒకే రకమైన వస్త్రధారణ, అలంకరణతో ఉంటాం. నాకు చిన్నప్పటి నుంచి కోలాటం అంటే ఉండే మక్కువతో శేషమాంబ టీచర్ దగ్గర నేర్చుకున్నాను. కోలాట నృత్యం అంతా ఒకేలా ఉండదు. పాటకు సంబంధించిన పల్లవి, చరణాలకు వివిధ రీతుల్లో నృత్యం చేయాల్సి ఉంటుంది. మా శ్రీ జయవీణ సంకీర్తనల కోలాటం నృత్య భజన సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా కోలాట నృత్యం నేర్పిస్తున్నాను. మా గ్రూపు తరఫు నుంచి తాటిచెట్లపాలెం, ఇసుకతోట తదితర ప్రాంతాలకు చెందిన సభ్యులతో కలిసి తిరుమల తిరుపతి, శ్రీశైలం, మంత్రాలయం, అన్నవరం, సింహాచలం, ఉపమాక, మధురై తదితర పుణ్యక్షేత్రాల్లో కోలాటం ఆడాం. ఉచితంగానే మేము ప్రదర్శన ఇస్తాం. ఈ నృత్యంతో భక్తిభావం, మానసిక ప్రశాంతత, ఆరోగ్యం లభిస్తాయి.

–జయలక్ష్మి, కోలాట నృత్య శిక్షకురాలు, తాటిచెట్లపాలెం

### కుటుంబ సహకారంతో..



నేను ఐదేళ్ల కిందట జయలక్ష్మి టీచర్ దగ్గర కోలాటం నేర్చుకున్నాను. ఇప్పుడు నా వయసు 60 ఏళ్లు. అయినా నేను చురుగ్గా ఉన్నానంటే కోలాటం ఆడటం వల్లే. ఆధ్యాత్మిక భావనలు, ఆరోగ్యం చేకూర్చే చక్కటి క్రీడ కోలాటం. కుటుంబ సహకారం, టీచర్ ప్రోత్సాహంతో దేశంలోని అనేక పుణ్యక్షేత్రాల్లో కోలాటం ఆడాం. కోలాటం ఎంతో సంతృప్తినిచ్చింది.

– మళ్ల వరలక్ష్మి, తాటిచెట్లపాలెం

### ప్రసిద్ధ ఆలయాల్లో ఆడాను



నేను సాయి కోలాటం గ్రూపు తరఫున దైవ కార్యాల్లో పాల్గొంటున్నాను. కోలాటం అంటే భగవంతుని సన్నిధిలో గడపటం అని నేను భావిస్తాను. నేను చురుగ్గా, ఆరోగ్యంగా ఉన్నానంటే.. అది కోలాటం వల్లే సాధ్యమైంది. మా గ్రూపు తరఫున రాష్ట్రంలోని పలు ప్రసిద్ధి ఆలయాల్లో కోలాటం ఆడాం.

– కె.రమాదేవి, అల్లిపురం

### గొప్ప అవకాశం



కోలాటం ఆడటం వల్ల మనసుకు ప్రశాంతత దొరుకుతుంది. నేను కణింకోటకు చెందిన సాయిదుర్గా కోలాట బృందం ద్వారా అనేక పుణ్యక్షేత్రాల్లో తోటి సభ్యురాళ్లతో కలిసి నృత్యం చేశాను. ఈ కళ ద్వారా దైవ సన్నిధిలో గడిపే అవకాశం కలుగుతుంది. పుణ్యక్షేత్రాల్లో కోలాటం ఆడుతుంటాం.

– మైచర్ల అరుణ, కణింకోట

### ఆరోగ్యం కుదుటపడింది



దేవుడి సేవకు మరో పేరే కోలాటం అని నేను నమ్ముతాను. నేను మూడేళ్ల కిందట జయలక్ష్మి టీచర్ దగ్గర కోలాటం నేర్చుకున్నాను. కోలాటం వల్ల భక్తి, మానసిక శాంతితో పాటు ఆరోగ్యం కూడా కుదుట పడుతుందని నేను నమ్ముతాను. నాకు స్పాండిలైటిస్ ఉండేది. ఈ నృత్యం చేస్తున్నప్పటి నుంచి అది తగ్గుముఖం పట్టింది.

– సూరిశెట్టి సూర్యకళ, ఇసుకతోట

### మానసిక ప్రశాంతత లభిస్తుంది



నాకు కోలాటం అంటే ఎంతో ఆసక్తి. చాలా ఏళ్లుగా నేను కోలాటం ఆడుతున్నాను. ఈ సేవ ద్వారా ఎన్నో ఆలయాలను దర్శించుకునే అవకాశం కలిగింది. కోలాటం వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుంది. కోలాటం ప్రాక్టీస్ వల్ల ఆరోగ్యం మెరుగు పడుతుంది.

– పద్మజ, సీతమ్మధార

### ఆధ్యాత్మిక భావన ఉప్పొంగుతుంది



కోలాటం ఆడేటప్పుడు ఆధ్యాత్మిక భావనలు ఉప్పొంగుతాయి. నేను 3 ఏళ్ల కిందట జయలక్ష్మి టీచర్ దగ్గర కోలాటం నేర్చుకున్నాను. మా బృంద సభ్యులంతా దేశంలోని పలు ఆలయాల్లో ఏటా కోలాటం ఆడతాం. వారానికి మూడు సార్లు టీచర్ సమక్షంలో ప్రాక్టీస్ చేస్తుంటాం. మాలికలు.. అంటే నృత్య రీతుల్లో వైవిధ్యం. ఇందుకోసం ప్రాక్టీస్ తప్పనిసరి. అవన్నీ మా టీచర్ బోధిస్తుంటారు. ఎక్కువగా అన్నమాచార్య కీర్తనలు, రాధాకృష్ణుల గీతాలకు నృత్యం చేస్తుంటాం.

– సూరిశెట్టి దేవి, ఇసుకతోట

### విశాఖ బులియన్

| | |
|---|---|
| 24 క్యారెట్స్(10 గ్రా.) | రూ.62,950 |
| 22 క్యారెట్స్(10 గ్రా.) | రూ.57,700 |
| వెండి(కిలో): | రూ.77,500 |

### కోడిగుడ్ల ధరలు

| | రూ.లలో (వందకు) |
|---|---|
| విశాఖ | 565.00 |
| విజయనగరం | 565.00 |
| శ్రీకాకుళం | 569.00 |

### చికెన్ ధరలు



| చికెన్ (కిలో) (వెన్‌కాబ్) | |
|---|---|
| బ్రాయిలర్ (లైవ్) | : రూ.120 |
| స్కిన్ | : రూ.210 |
| స్కిన్‌లెస్ | : రూ.220 |

## అందరి సహకారంతోనే అభివృద్ధి

- కలెక్టర్ మల్లికార్జున ఉద్ఘాటన
- పెదగంట్యాడ తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం



తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

**పెదగంట్యాడ:** అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి ఫలాలు సిద్ధిస్తాయని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. ఆధునిక హంగులు, అదనపు వసతులతో రూపుదిద్దిన పెదగంట్యాడ తహసీల్దార్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌తో కలసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యాలయంలో పనులు చేపడతామని అధికారులు తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే రూ.5 లక్షలు మంజూరు చేశామని గుర్తు చేశారు. ప్రభుత్వ నిధులతో పాటు స్థానికంగా ఉంటున్న దాతల సహకారంతో ఈ కార్యాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామన్నారు. స్థానిక అధికారుల చొరవ ప్రశంసనీయమని కొనియాడారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు పనుల స్ఫూర్తితో ప్రభుత్వ కార్యాలయాల అభివృద్ధికి అధికారుల చొరవ అభినందనీయమన్నారు. ప్రజల సౌకర్యార్థం నియోజకవర్గం పరిధిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. కలెక్టర్ సహకారంతో గాజువాకకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలకు పరిష్కారం చూపించామని వివరించారు. అనంతరం అభివృద్ధికి సహకరించిన పలువురు దాతలను కలెక్టర్, ఎమ్మెల్యే సత్కరించారు. తహసీల్దార్ రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర రెడ్డి, తహసీల్దార్ శ్రీవల్లి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నర్సింహపాత్రుడు, గంధం శ్రీనివాసరావు, శ్రావణ్ షిప్పింగ్ అధినేత సాంబశివరావు, సీఐ ఎర్రన్నాయుడు పాల్గొన్నారు.

## బీచ్‌లో 'మిస్ పర్ఫెక్ట్' సందడి



బీచ్ క్లీనింగ్‌లో పాల్గొన్న సినీనటి లావణ్య త్రిపాఠి



వలంటీర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న లావణ్య త్రిపాఠి

**ఏయూక్యాంపస్:** సినీనటి లావణ్య త్రిపాఠి ఆదివారం ఉదయం బీచ్‌రోడ్డులో సందడి చేశారు. తన తదుపరి ప్రాజెక్ట్ మిస్ పర్ఫెక్ట్ ప్రమోషన్లలో భాగంగా వైజాగ్ వలంటీర్లతో కలిసి వైఎంసీఏ వద్ద తీరాన్ని శుభ్రం చేశారు. జాతీయ పరిశుభ్రత దినోత్సవం పురస్కరించుకుని ఉదయం 6 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన బీచ్ క్లీనింగ్ కార్యక్రమంలో ఆమె ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరి 2న 'మిస్ ఫర్ఫెక్ట్' వెబ్ సిరీస్ రిలీజ్ అవుతుందని, అందరూ చూడాలని కోరారు. పరిశుభ్రత పట్ల అంకిత భావం కలిగిన మహిళగా ఈ సిరీస్‌లో కనిపిస్తానన్నారు. విశాఖ నగరం ఎంతో సుందర నగరమని, ఈ నగరాన్ని మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. వైజాగ్ అంటే తనకు ఎంతో ఇష్టమని, ఎన్నో సూపర్ హిట్ సినిమాలు ఇక్కడే షూట్ చేశారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలతో పాటు నగరాన్ని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. బీచ్ క్లీనింగ్‌లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వందసార్లకుపైగా బీచ్ క్లీనింగ్‌లో పాల్గొన్న వలంటీర్లకు ఆమె జ్ఞాపికలు అందజేశారు.

## క్యాన్సర్ నివారణకు సమగ్ర చికిత్స అవసరం





మాట్లాడుతున్న రమావత్ దేవ్

**ఏయూక్యాంపస్:** కాన్సర్ నివారణకు సమగ్ర చికిత్స అవసరమని మెడికవర్ హాస్పిటల్స్ క్యాన్సర్ చికిత్స విభాగం వైద్యులు, క్యాన్సర్ క్యూర్‌ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ రమావత్ దేవ్ అన్నారు. ఆదివారం ఉదయం బీచ్‌రోడ్డులోని ఒక హోటల్లో లింఫోమాపై ఏర్పాటు చేసిన వైద్యనిపుణుల సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దేశ విదేశాల నుంచి వచ్చిన వైద్య నిపుణులు నూతన అంశాలను, ఆవిష్కరణలు, చికిత్స విధానాలను వివరించడం జరుగుతోందన్నారు. ప్రతీ ఇంట్లో క్యాన్సర్ రోగులు కనిపించే పరిస్థితి నేడు ఉందని, సంపూర్ణ చికిత్సను అందరూ తీసుకోలేక పోతున్నారన్నారు. పేద రోగులకు ప్రత్యేకంగా సహాయం చేయడానికి క్యాన్సర్ చికిత్స అందించే విధంగా తమ ట్రస్ట్ పనిచేస్తోందన్నారు. ప్రత్యేక స్క్రీనింగ్ శిబిరాలు ఏర్పాటు చేసి రోగులను గుర్తిస్తున్నామన్నారు. గ్రామాల్లో సైతం అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. యూకే నుంచి విచ్చేసిన వైద్యులు వివేక్ రాధాకృష్ణ మాట్లాడుతూ నా నైపుణ్యాలను, జ్ఞానాన్ని అడ్వాన్స్ లింఫోమా రంగంలో పంచుకోవడానికి ఇక్కడకు రావడం జరిగిందన్నారు. రక్త క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. ట్రస్ట్ సైంటిఫిక్ అడ్వైజర్ డాక్టర్ సాయినాథ్, డాక్టర్ అభిలాష్, డాక్టర్ సాహిత్య తదితరులు పాల్గొన్నారు.

## సుందరంగా ఆశీల్‌మెట్ట అండర్‌పాస్



అందంగా ముస్తాబైన అండర్‌పాస్

**డాబాగార్డెన్స్:** నగర సుందరీకరణలో భాగంగా విశాఖను ఆకర్షణీయంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా రూ.కోటి 47 లక్షలతో ఆశీల్‌మెట్ట అండర్‌పాస్ ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఈ పనులకు సంబంధించి నెల రోజుల కిందటే నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ భూమిపూజ చేశారు. నెలన్నర వ్యవధిలోనే సుందరీకరణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చారు. తారురోడ్డు నిర్మాణం, ఆకర్షణీయ పెయింటింగ్‌లు, స్పీడ్ బ్రేకర్లు, స్ప్రింగ్ పోల్స్, ఆధునిక లైటింగ్‌తో తీర్చిదిద్దారు. జీవీఎంసీ గాంధీ పార్క్ నుంచి ఆశీల్‌మెట్ట..రామాటాకీస్‌కు వెళ్లే అండర్‌పాస్, రామాటాకీస్ నుంచి జీవీఎంసీ గాంధీ పార్కు వైపు వచ్చే అండర్‌పాస్ పనులు పూర్తి కావడంతో నగర ప్రజలను పెయింటింగ్ ఆకర్షిస్తోంది.



## రెండు చోట్ల గంజాయి స్వాధీనం

**గోపాలపట్నం:** అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వాహనంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. అడవివరంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గిరిజన ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ముంచంగిపుట్టు నుంచి బొలేరా వాహనంపై నగరంలోకి గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో అడవివరం వద్ద తనిఖీ చేశారు. వాహనాన్ని తనిఖీ చేయగా 31 కిలోల గంజాయి పట్టుబడింది. అక్రమంగా తరలిస్తున్న వ్యక్తుల్లో ఇద్దరు పరారుకాగా వ్యాన్ డ్రైవర్ కె.గోపాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గోపాలపట్నం ఎస్‌ఐ ఎస్.అప్పలనాయుడు దర్యాప్తు చేస్తున్నారు.

**తాటిచెట్లపాలెం :** అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు విశాఖపట్నం రైల్వేస్టేషన్లో ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... ఎన్నికల విధుల్లో భాగంగా గవర్నమెంట్ రైల్వే పోలీసు ఇన్‌స్పెక్టర్ బి.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్‌ఐ వి.బాలాజీరావు, ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ కె.అనంతరావు, జీఆర్పీ, ఆర్పీయఫ్ సిబ్బంది రైల్వేస్టేషన్‌లో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో బిహార్ రాష్ట్రానికి చెందిన సందీర్‌కుమార్(22) లగేజీలో 8 కిలోల గంజాయి లభించింది. విశాఖపట్నం నుంచి భువనేశ్వర్ తరలించేందుకు సిద్ధం చేసినట్లు సందీర్ అంగీకరించడంతో అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచామని జీఆర్పీ సిబ్బంది తెలిపారు.